ఏఐటీయూసీ గెలుపు కార్మికుల విజయం

• యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

గోదావరిఖని, డిసెంబర్ 28: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు ఏఐటీయూసీ పక్షాన నిలబడి గెలిపించుకున్నారని యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడారు. పోరాటాల చరిత్ర కలిగిన ఏఐటీయూసీతోనే సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మి యూనియన్ గెలిపించుకున్న కార్మికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అధికార పార్టీ సింగరేణి కార్మికులకు మద్యం పంపిణీ చేసిపా కార్మికులు అలాంటి ప్రలోభాలకు లొంగలేదన్నది స్పష్టమవుతుందన్నారు. యాజమాన్యం, ప్రభుత్వంతో రాజీ లేని పోరాటాలు చేస్తామనీ, కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్మికుల సొంతింటి కలను నెరవేరుస్తామన్నారు. యువ కార్మికులు ఈ ఎన్నికల్లో కీలక భూమిక పోషించారని, ఎక్కడ కూడా ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఏఐటీయూసీకి ఓటు వేసి గెలిపించుకున్నారన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనకు కృషి

సంబురాలు చేసుకుంటున్న ఏఐటీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబర్ 28 : సింగరేణి బొగ్గు గని కార్మికులు తమపై ఎంతో నమ్మకంతో ఓటేసి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘంగా గెలిపించిన కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తామని ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు ఎల్ ప్రకాశ్ పేర్కొన్నారు. సింగరేణి గుర్తింపు, ఆర్జీ-2 ఏరియా ప్రాతినిధ్య సంఘంగా గెలిపించడంతో డివిజన్ కార్మికులు గురువాం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారికి ఇచ్చిన హామీలను యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి జిగురు రవీందర్, ఉపాధ్యాక్షుడు రాజరత్నం, బీ. అన్నారావు, సాంబశివరావు, శ్యాంసన్, బుర్ర తిరుపతి, వెంకటేశ్వర్లు, మామిడి మహేందర్, బొట్ల సంపత్, ఆవుల రవి, కోండ్ర సత్యనారాయణ, ఇల్లూటూరి పుల్లయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

గోదావరిఖని, డిసెంబర్ 28: సింగరేణి ఎన్నికల్లో కార్మికుల ఓట్లతో గెలిచిన గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ఉద్యమం తప్పదని సీఐటీయూ నాయకుడు రాజారెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో తమ యూనియన్‌కు కార్మికులు మూడో స్థానం కల్పించడం నైతిక విజయంగా భావిస్తున్నామన్నారు. తాము గుర్తింపు సంఘంగా గెలవకపోయినా ఎప్పుడూ కార్మికుల పక్షానే ఉంటామన్నారు. తాము ఇచ్చిన హామీ మేరకు ఆ దిశగా సాకారం అయ్యేలా యాజమాన్యం, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవచ్చేందుకు పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

సింగరేణి ఎన్నికల్లో భారీగా పోలింగ్

గోదావరిఖని, డిసెంబర్ 28: సింగరేణి సంస్థలో బుధవారం జరిగిన కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో భారీ పోలింగ్ నమోదైంది. మొత్తం 39773 మంది ఓట్లకు గాను 37451 ఓట్లు (94.16) నమోదైంది. ఈ ఓట్లలో 13 సంఘాల ఓట్లు ఈ విధంగా ఉన్నాయి. ఏఐటీయూసీకి 16177, ఐఎన్‌టీయూసీకి 14178, సీఐటీయూకు 3710, టీబీజీకేఎస్‌కు 1298, హెచ్ఎంఎస్‌కు 947, బీఎంఎస్‌కు 917, జీఎల్‌బీకేఎస్ 116, టీఎస్ ఉద్యోగుల సంఘానికి 17 ఓట్లు పోలయ్యాయి.

ఏఐటీయూసీ గెలుపుతో సంబరాలు

సింగరేణి కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ ఘన విజయం సాధించడంతో గురువారం ఓసీపీ-5లో సంబరాలు జరిపారు. ప్రాజెక్టుపై పటాకులు పేల్చి సంబురాలు చేసుకున్నారు .కార్యక్రమంలో నాయకులు మహేశ్, గండి ప్రసాద్, ఫిట్ సెక్రెటరీ ప్రభుదాస్, ఎడవెల్లి రాజిరెడ్డి, సత్యనారాయణ, పర్శరాములు, పాపన్న, సత్యనారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి గుర్తింపు ఎన్నికల నిర్వహణపై సమీక్ష

గోదావరిఖని, డిసెంబర్ 28: సింగరేణిలో జరిగిన గుర్తింపుసంఘం ఎన్నికల నిర్వహణపై ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడారు. ఆర్జీ-1 ఏరియాలో నిర్వహించిన ఎన్నికలకు సంబంధించి గనులు, డిపార్ట్‌మెంట్లలో కేంద్రాల ఏర్పాట్లు, సౌకర్యాలు, భద్రత నిర్వహణలో బాధ్యత వహించిన అధికారులను అభినందించారు. గనుల్లో పోలింగ్ బూత్‌ల ఏర్పాట్లు, కమ్యూనిటీ హాల్ వద్ద ఎన్నికల లెక్కింపుకు సంబంధించి ఏర్పాట్లపై సంతృప్తిని వెల్లడించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించిన ప్రతి ఒక్కరిని అభినందించారు. సెంట్రల్ లేబర్ డిపార్ట్‌మెంట్, పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఏజీఎం రామ్మూర్తి, ఏజెంట్ చిలక శ్రీనివాస్, ఐఈడీ ఆంజనేయులు, డీజీఎం ధనలక్ష్మి, డీజీఎం సివిల్ నాగేశ్వరరావు, డీవైపీసీఎంఓ కిరణ్ రాజ్‌కుమార్, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, మదన్‌మోన్, బాల సుబ్రహ్మణ్యం, అభిలాష్ పాల్గొన్నారు.

'ప్రజాపాలన' కోసం కంట్రోల్ రూం ఏర్పాటు

పెద్దపల్లి, డిసెంబర్28: ప్రజాపాలన కార్యక్రమం సజావుగా సాగేందుకు సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం నిర్వహణకు సంబంధించి ప్రజల సందేహాలను నివృత్తి చేసేందుకు రెండు షిఫ్టులలో విధులు నిర్వహించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారని వివరించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 7 గంటల వరకు కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని వెల్లడించారు. ప్రజా పాలన కార్యక్రమంపై సందేహాలు, దరఖాస్తులు అందజేయంలో సమస్యలు ఉన్న వారు కంట్రోల్ రూమ్ ఫోన్ 7995070699లో సంప్రదించాలని సూచించారు.

ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పథకాలు అందించడానికే ప్రజా పాలన

• ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ధర్మారం,డిసెంబర్28:అర్హులకు పథకాలు అందించడానికే తమ ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమం ఏర్పాటు చేసిందని ప్రభుత్వ విప్,ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మారం మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన 'ప్రజా పాలన' గ్రామ సభకు విప్ లక్ష్మణ్ కుమార్ హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయడానికి గ్రామ సభలు నిర్వహిస్తు న్నదన్నారు. తెల్ల రేషన్ కార్డుదారులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పార్టీల కతీతంగా విజయవంతానికి అధికారులు, సిబ్బంది సహకారం అందించాలని ఆయన సూచించారు.ఏదైన సమస్య ఉంటే ప్రజలు తనను నేరుగా వచ్చి కలిస్తే పరిష్కరించటానికి కృషి చేస్తానని, తానొక సేవకుడిగా ఉంటానని లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారుల నుంచి లక్ష్మణ్‌కుమార్ అర్జీలు స్వీకరించారు. ఆయనకు స్థానిక జీపీ కార్యదర్శి లక్ష్మణ్ బాబు, కారోబార్ దేవి కిరణ్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీధర్, ఎంపీడీవో భీమ జయశీల,తహసీల్దార్ అంబటి రజిత,జీపీ కార్యదర్శి లక్ష్మణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం

• పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు

సుల్తానాబాద్ రూరల్ : దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్/పెద్దపలి రూరల్, డిసెంబర్28:ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం మియ్యాపూర్, చిన్నబొంకూర్, పెద్దపల్లి మండలం హన్మంతునిపేటలో గురువారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామసభలకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలు ఈ సభలను వినియోగించుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. అదనపు కలెక్టర్ శ్యామ్ సుందర్‌తో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను అందిస్తామని చెప్పారు. గ్రామాల్లో ఏ ఒక్క దరఖాస్తు మిస్సింగ్ అయిన దానికి పూర్తి బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే అన్నారు. అర్హులదరికీ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. కార్యక్రమాల్లో జడ్పీసీఈవో శ్రీనివాస్, జిల్లా సంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీమాల, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కోల్‌సిటీ : దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

పారదర్శకంగా అమలు చేయాలి

• రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

కోల్‌సిటీ/పాలకుర్తి, డిసెంబర్ 28: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయ హస్తంలోని ఆరు గ్యారెంటీ పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని రామగుండం 29వ డివిజన్ బాపూజీ నగర్, పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లిలో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అమలుకు చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. పేదలకు పథకాలు అమలు చేయాలనే లక్ష్యంతో ప్రజా పాలనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి డివిజన్, వార్డుల వారీగా అధికారులు, సిబ్బంది ఓపికగా దరఖాస్తులు స్వీకరించా లన్నారు. ఒకవేళ దరఖాస్తులు సమర్పించలేని వారు ఆ తర్వాత మునిసిపల్, మండల కార్యాలయంలోఇవ్వొచ్చని స్పష్టం చేశారు. ఈ పథకాలను అమలు చేయిస్తామంటూ దళారులు ఇళ్ల వద్దకు వస్తుంటారని, వారెవ్వరైనా సరే ఒక్క పైసా కూడా ఇవ్వొద్దన్నారు. తనకు సమాచారం ఇస్తే తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రజాపాలనకు తొలిరోజు దరఖాస్తుల వెల్లువ

• జిల్లాలో మొదటి రోజు 24, 347 అర్జీలు

• సభలకు ఏర్పాట్లు చేసిన అధికారులు

పెద్దపల్లి, డిసెంబర్28(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన సభలకు జిల్లాలో స్పందన లభించింది. తొలి రోజు 24, 347 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. జిల్లాలోని 13 మండలాలు, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజా పాలనలో గ్రామ/ వార్డు సభలు నిర్వహించారు. జిల్లాలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 66 గ్రామ/ వార్డు సభలు నిర్వహించి మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు గానూ 24, 347 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రజాప్రతినిధుల, అధికారుల పర్యవేక్షణలో...

ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణను ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యవేక్షించారు. సుల్తానాబాద్ మండలం మియాపూర్, పెద్దపల్లి మండలం హనుమంతుని పేటలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 29వ వార్డు బాపూజీ నగర్‌లో నిర్వహించిన వార్డు సభలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, మంథని నియోజక వర్గం కమాన్‌పూర్ మండలం గుండారంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ, ధర్మారం మండల కేంద్రంలో ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గ్రామ/ వార్డు సభల్లో పాల్గొని ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్హులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పథకాలు అందించడానికే ప్రజా పాలన

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 28: ప్రజలకు పథకాలు అందించడానికే ప్రభుత్వం ప్రజాపాలన చేపట్టిన చేపట్టిందని పెద్దపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ మమతారెడ్డి తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని 1,2,3, వార్డుల్లో ఉదయం కమిషనర్ వెంకటేశ్‌తో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొదటి రోజు మొత్తం 569 అర్జీలు అందినట్లు కమిషనర్ వెంకటేశ్ తెలిపారు. ఎస్ఐ అర్కుటి మహేందర్, మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీశ్‌కుమార్, కౌన్సిలర్లు ఈరబొయిన శ్రీనివాస్, పస్తం హన్మంత్‌లైశెట్టి భిక్షపతి పాల్గొన్నారు.

పెద్దపల్లి మండలంలో..

పెద్దపల్లి రూరల్, డిసెంబర్28: మండలంలోని అప్పన్నపేట, అందుగులపల్లి, భోజన్నపేట, హన్మంతు నిపేటలో ఎంపీడీవో ఎం రాజు, తహసీల్దార్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో సుదర్శన్, అధికారులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ మండలంలో..

సుల్తానాబాద్‌రూరల్, డిసెంబర్28: మియ్యాపూర్, చిన్నబొంకూర్, కొదురుపాక, దేవునిపల్లి, భూపతిపూర్, నారాయణరావుపల్లెలో ప్రజాపాలన సభలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, జడ్పీటీసీ స్వరూప, ఎంపీడీవో శశికళ, విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సర్పంచ్‌లు ఎంపీటీసీలు ఉన్నారు.

మొదటి రోజు 696 దరఖాస్తులు

సుల్తానాబాద్, డిసెంబర్ 28 : సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 2,3 వార్డుల్లో నిర్వహించిన ప్రజాపాలన సభల్లో 696 మంది దరఖాస్తులు చేసుకున్నారని కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో వైద్యారోగ్య సిబ్బంది ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు.

పెద్దపల్లి టౌన్ : దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి

మంథని : దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి

శిబిరాన్ని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ సందర్శించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ప్రత్యేకాధికారి జే భాస్కర్ నాయక్ , కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులున్నారు.

ఓదెల మండలంలో..

ఓదెల, డిసెంబర్28: పిట్టలెల్లయ్యపల్లె, అబ్బిడిపల్లె, బాయమ్మపల్లెలో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. మొత్తం 489 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.తహసీల్దార్ యాకన్న,ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో వాజిద్, ఆయా గ్రామాల కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం మండలంలో..

ధర్మారం,డిసెంబర్28: ధర్మారం, ఎర్రగుంటపల్లి, కొత్తపల్లి, నందిమేడారం,నర్సింగాపూర్,నాయకంపల్లిలో గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో టీమ్ లీడర్లు ఎంపీడీవో జయశీల, తహసీల్దార్ రజిత, ఎంపీవో కే రమేశ్, ఏవో ఎస్ఎంఎస్ పూర్ణిమ పర్యవేక్షించారు. మొత్తం 2,789 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

జూలపల్లి మండలంలో..

జూలపల్లి, డిసెంబర్ 28 : నాగులపల్లిలో ప్రజా పాలన గ్రామ సభను ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి ప్రారంభించారు. మొత్తం 312 కుటుంబాలకు 287 మంది దరఖాస్తు చేసుకున్నారు. నోడల్ ఆఫీసర్ మాధవి, ఎంపీడీవో వేణు గోపాల్‌రావు పర్యవేక్షించారు. వెంకట్రావ్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మండల ప్రత్యేకాధికారి రంగారెడ్డి, తహసీల్దార్ బషీరొద్దీన్ పరిశీలించారు. ఇక్కడ 525 కుటుంబాలకు 475 మంది దరఖాస్తు చేసుకున్నారు. సర్పంచులు రేశవేని రాధ, పొలవేని వీరయ్య, ఎంపీటీసీ సభ్యులు పల్లె స్వరూప, కత్తెర్ల శ్రీనివాస్, డీటీ అబుబాకర్, ఎంపీవో కిరణ్, ఏవో ప్రత్యూష, ఏఈ సుమలత, సబ్ ఇంజనీర్ సాయినాథ్‌రెడ్డి, ఏపీవో సదానందం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తోట లక్ష్మి పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ మండలంలో..

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్28: ఇద్లాపూర్, అంకంపల్లి, ఆశన్నపల్లె, ఆరెపల్లె, చిన్నరాత్‌పల్లి, గంగారం గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. మొత్తం 1276 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి ఆదిరెడ్డి, తహసీల్దార్ జాహెద్‌పాషా, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఏవో నాగార్జున, ఎంపీవో గోవర్ధన్, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రామగుండం నియోజకవర్గంలో..

కోల్‌సిటీ, డిసెంబర్ 28: రామగుండం నగర పాలక సంస్థ 29వ డివిజన్ బాపూజీ నగర్‌లోప్రజాపాలన సభ నిర్వహించారు. కార్పొరేషన్‌లోని 50 డివిజన్లలో ప్రజాపాలన సభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామనీ, ఇందుకు నాలుగు బృందాలను ఏర్పాటు చేశామని అదనపు కలెక్టర్ అరుణ శ్రీ తెలిపారు. కార్పొరేటర్ మహంకాళి స్వామి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ అనిల్ కుమార్, కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్ రావు, ప్రత్యేక అధికారులు శ్రీనివాసులు, మహమూద్, వన్ టౌన్ సీఐ ప్రమోద్ రావు, మెప్మా డీఎంసీ రజనీ, ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఎగబడిన ప్రజలు

29వ డివిజన్‌లో ప్రజలు వివిధ పథకాలకు దరఖాస్తులు చేసుకునేందుకు ఎగబడ్డారు. ట్రాన్స్‌జెండర్లు, మహిళలు, వృద్ధులు, యువతులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం 6,7,8 డివిజన్ల పరిధిలోని గంగానగర్, పవర్ హౌస్ కాలనీలో జరిగిన ప్రజా పాలన సభలో కార్పొరేటర్లు దాతు శ్రీనివాస్, వేగోళపు రమాదేవి శ్రీనివాస్ ఆధ్వర్యంలో దరఖాస్తులు చేసుకునారు.

ఎన్టీపీసీలో..

జ్యోతినగర్, డిసెంబర్ 28: ఎన్టీపీసీ మూడో డివిజన్ అన్నపూర్ణకాలనీ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్, రెండో డివిజన్ పీకే రామయ్యకాలనీ, రామగుండంలోని విలేజ్ రామగుండం ప్రభుత్వ పాఠశాల, ఐదో డివిజన్ నర్రశాలపల్లి అంబేద్కర్ భవన్‌లో ప్రజాపాలన సభలు నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన ఈ సభల్లో తహసీల్దార్ కుమార స్వామి, కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, రమణారెడ్డి, ముదాం శ్రీనివాస్, కృష్ణవేణి, మాజీ కార్పొరేటర్ వెంగళ పద్మ బాపు, ట్రాన్స్‌కో ఏఈలు శ్రీనివాస్, దేవసాని, దామోదర్, ఆరెపల్లి శ్రీనివాస్, వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

పాలకుర్తి మండలంలో..

పాలకుర్తి, డిసంబర్28: కొత్తపల్లి, ఈసాలతక్కళ్లపల్లి, పాలకుర్తి, రామారావుపల్లిలో ప్రజా పాలన సభలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనం తరం మొదటిసారి ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి వచ్చిన మక్కాన్‌సింగ్‌ను గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఎంపీపీ వ్యాళ్ల అనసూర్యారాంరెడ్డి, సర్పంచ్ ముక్కెర రాజకుమారి శ్రీనివాస్, ఎంపీడీవో లలిత, ఎంపీవో షబ్బీర్ పాల్గొన్నారు.

మంథని నియోజకవర్గంలో..

మంథని, డిసెంబర్ 28: మంథని మున్సిపాలిటీ చైతన్యపురి కాలనీ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1వ వార్డు, పోచమ్మవాడలోని గణపతి మండపం ఆవరణలో 8వ వార్డు ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 767 దరఖాస్తులు వచ్చినట్లు మున్సి పల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి తెలిపారు. ఆర్డీవో హనుమా నాయక్ పర్యవేక్షించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సీడీపీవో పద్మశ్రీ పాల్గొన్నారు.

మంథని మండలంలో..

మంథని రూరల్, డిసెంబర్ 28:భట్టుపల్లి , వెంకటాపూర్, అక్కెపల్లి, లక్కెపూర్, నాగారం, కన్నాల, దుబ్బపల్లి, సిరిపురం గ్రామాల్లో అధికారులు ప్రజా పరిపాలన సభలు నిర్వహించారు. 8 గ్రామాల్లో మొత్తం 1899 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కొండ శంకర్, తహసీల్దార్ రాజయ్య, ఎంపీడీవో రమేశ్, గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాస్‌రావు, ఏవో శ్రీకాంత్, ఎంపీవో ఆరిఫ్ హుస్సేన్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి..

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని జడ్పీటీసీ తగరం సుమలత శంకర్‌లాల్ కోరారు. సిరిపురం పంచాయతీలో నిర్వహించిన ప్రజా పరిపాలన కార్యక్రమంలో ఆమె మాట్లా డారు. సర్పంచ్ దండె ప్రసాద్ తదితరులున్నారు.

సభలను సద్వినియోగం చేసుకోవాలి

కమాన్‌పూర్, డిసెంబర్ 28: అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రజా పాలన గ్రామ, వార్డు సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ అరుణ శ్రీ సూచించారు. కగుండారం జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రజా పాలన గ్రామ సభలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాచకొండ లక్ష్మి, సర్పంచ్ ఆకుల ఓదెలు, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, డీఎల్‌పీవో రాంబాబు, తహసీల్దార్ మోహన్ రెడ్డి, ఎంపీడీ వో విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రామగిరి మండలంలో..

రామగిరి, డిసెంబర్ 28 : మండలంలోని బుధవారం పేట, సుందిళ్లలో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మంథని ఆర్డీవో హనుమా నాయక్, ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్యాగౌడ్, తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎంపీవో కాటం భాస్కర్ పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్‌లు దేవునూరి రజిత శ్రీనివాస్, దాసరి లక్ష్మీరాయలింగు, టూటౌన్ సీఐ వెంకటే శ్వర్లు, స్పెషల్ ఆఫీసర్ ,మైనింగ్ ఏ.డి సాయినాథ్, డిప్యూ టీ తహసీల్దార్ రాకేశ్, దుర్గా ప్రసాద్, ఏఈలు రవి కుమార్, శృతి,ఆర్ ఐ రాజబాబు, ఏవో మోహన్,మెడికల్ ఆఫీసర్స్ ప్రదీప్, చంద్ర శేఖర్, ఐకేపీ పీఎం స్వరూప రాణి పాల్గొన్నారు.

605 దరఖాస్తులు

ముత్తారం, డిసెంబర్ 28: మండలంలోని ఓడేడ్ గ్రామంలో నిర్వహించిన ప్రజా పరిపాలన సభకు 605 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ బండి రాజేశ్వరి తెలిపారు. ఎస్ఐ మధుసూదన్ రావు పాల్గొన్నారు.



జ్యోతినగర్ : మూడో డివిజన్‌లో దరఖాస్తులు ఇచ్చేందుకు బారులు తీరిన మహిళలు

2న సదరం స్లాట్ బుకింగ్

పెద్దపల్లి, డిసెంబర్28: వచ్చే నెలలో నిర్వహించే దివ్యాంగుల వైద్య నిర్ధారణ పరీక్షల కోసం జనవరి 2న ఉదయం 11:35 గంటల నుంచి మీ -సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని డీఆర్డీవో వీ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా సదరం సర్టిఫికెట్ కావాల్సిన వారు, తాత్కాలిక సర్టిఫికెట్ పొందిన వారు రెన్యువల్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. శారీరక వైకల్యం ఉన్న వారికి జనవరి 4, 25న , దృష్టి లోపం ఉన్న వారికి 11న, మానసిక అంగ వైకల్యం, బుద్ధి మాంద్యం ఉన్నవారికి 18న, వినికిడి లోపం గలవారికి 25న సదరం క్యాంపు నిర్వహించి వైద్య నిర్ధారణ పరీక్షలు చేస్తారని వెల్లడించారు. స్లాట్ బుకింగ్ రసీదుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో సదరం క్యాంపులకు హాజరు కావాలని సూచించారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పాలకుర్తి, డిసెంబర్28: పాలకుర్తి మండలం జీడీనగర్ యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఇస్మాయిల్ తెలిపారు. పాఠశాలకు చెందిన కె.రామ్‌చరణ్, విక్రమ్‌భాగ్ ఈనెల 30 నుంచి నల్గొండ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు కరీంనగర్ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 22న సెంటినరీ కాలనీలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థులను కరస్పాండెంట్ ఇస్మాయిల్‌తోపాటు, ప్రధానోపాధ్యాయులు అఫ్జల్, పీఈటీ సంతోష్ అభినందించారు.

కొవిడ్ జాగ్రత్తలు పాటించాలి

గోదావరిఖని, డిసెంబర్ 28: సింగరేణి కార్మికులు కొవిడ్ నివారణ జాగ్రత్తలు పాటించాలని సింగరేణి ఏరియా హాస్పిటల్ సీఎంవో కిరణ్ రాజ్ తెలిపారు. ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక జీడీకే-2వ గనిలో ఆరోగ్య సంరక్షణ, జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కొవిడ్ ద్వారా వ్యాపించే వ్యాధులను గురించి వివరించారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే సకాలంలో గుర్తించి వైద్యులను సంప్రదించాలని సూచించారు. డాక్టర్ సుమన్, గని మేనేజర్ వెంకటేశ్వర్లు, షిఫ్ట్ ఇన్చార్జి కుమార స్వామి, సంక్షేమాధికారి గణేశ్, గని కార్మికులు పాల్గొన్నారు.

రేపు ఖనిలో సాహితీ సభ

కోల్‌సిటీ, డిసెంబర్ 28: అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో గోదావరిఖని మార్కండేయ కాలనీలోని స్నేహ సాహితీ గ్రంథాలయంలో సాహితీ సభ నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధి ఏలేశ్వరం వెంకటేశ్ తెలిపారు. ఈ సభకు కవులు, రచయితలు , సాహితీ మిత్రులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి దుర్మరణం

జూలపల్లి, డిసెంబర్ 28 ః కుమ్మరికుంట కు చెందిన వేల్పుల రాములు (48) బుధవారం రాత్రి కాచాపూర్ కల్వర్టు వద్ద ట్రాక్టర్ కింద పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాములు కూలీ పనులు చేసుకుంటూ మూడేండ్ల కిందట కూతురు పెండ్లి చేశాడు. 8 నెలల క్రితం కొడుకు మహేశ్‌ను ఉపాధి కోసం దుబాయ్ పంపాడు. బుధవారం ఉదయం పెద్దపల్లికి వెళ్లి తన పనులు ముగించుకుని తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో రాములు స్వగ్రామానికి బైక్ పై వస్తున్నాడు. కాచాపూర్-కీచులాటపల్లి గ్రామాల మధ్య ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టగా అక్కడిక్కడే మృతిచెందాడు. కాచాపూర్‌కు చెందిన బాల్సాని తిరుమల్ జాన్‌డీర్ ట్రాక్టర్ (నంబర్ టీఎస్22బీ 6106) అజాగ్రత్తగా అతివేగంగా నడిపి ఢీ కొట్టినట్లు మృతుడి భార్య భాగ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.జూలపల్లి ఎస్ఐ వెంకటకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



శోభాయాత్రలో వేషధారణలో కళాకారులు

కనుల పండువగా శోభాయాత్ర

ధర్మారం, డిసెంబర్ 28: ధర్మారం మండల కేంద్రంలో గురువారం రాత్రి శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు తాటిపల్లి ఈశ్వర్, అయ్యప్ప దీక్ష స్వాముల ఆధ్వర్యంలో ఈ ఉత్సవం నిర్వహించారు. ఉదయం ఆలయంలో అయ్యప్ప స్వామి మూల విరాట్‌కు అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీరామాలయం నుంచి రథంలో స్వామి వారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు చేపట్టారు. శోభాయాత్రలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రదర్శనలతో ఎంతగానో ఆకట్టుకున్నారు. అనంతరం అర్ధరాత్రి అయ్యప్ప పడిపూజ మహోత్సవం నిర్వహించారు. దీక్ష స్వాములు అగ్నిగుండాల ప్రవేశంతో ఉత్సవం ముగిసింది.